# కంటి కాన్సర్: మరింత అవగాహన అవసరమయిన ఒక అరుదైన గంభీర సమస్య

చాలామంది కాన్సరు ఊపిరితిత్తులు, రొమ్ము, లేదా చర్మానికి సంబంధించినదని అనుకుంటారు. కానీ కాన్సరు కళ్ళను కూడా ప్రభావితం చేస్తుందని చాలా కొద్దిమందికి తెలుసు. కంటి కాన్సర్ అరుదయినప్పటికీ, త్వరితంగా గుర్తించకపోతే అది ప్రాణాంతకం కావచ్చు, మరియు శాశ్వతంగా చూపు పోవడానికి లేదా కంటిని పూర్తిగా తీసివేయడానికి దారితీయవచ్చు. దురదృష్టవశాత్తూ, అవగాహనా లోపం చాలా కేసులు తీవ్రమైన దశలో గుర్తించబడటానికి దారితీస్తున్నది. ఆ దశలో చికిత్స ఎంపికలు పరిమితమవుతాయి.

## భారతదేశంలో పెరుగుతున్న కంటి కాన్సర్ భారం

ప్రపంచవ్యాప్తంగా భారతదేశం కంటి కాన్సర్, ముఖ్యంగా బాల్య కంటి కాన్సర్ల అత్యధిక భారాన్ని మోస్తున్నది. పిల్లలలో ప్రాణాంతకమైన కంటి కాన్సర్ రెటినోబ్లాస్టోమా ఇతర దేశాలకంటే భారతదేశంలో ఎక్కువగా ఉన్నది. ప్రపంచవ్యాప్తంగా రెటినోబ్లాస్టోమా కేసులలో అత్యధిక సంఖ్య ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోనే నమోదవుతున్నాయి, భారతదేశంలోనే అత్యధిక సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి.

పెద్దవారిలో ఉన్న సాధారణ కంటి కాన్సరులలో ఆక్యులర్ సర్ఫేస్ స్క్వామస్ నియోప్లాసియా (ఓఎస్ఎస్ఎన్) మరియు సెబాసియస్ గ్లాండ్ కార్సినోమా ఉన్నాయి. 10 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారిలో ఓఎస్ఎస్ఎన్ ప్రధాన కంటి క్యాన్సర్. సెబాసియస్ గ్లాండ్ కార్సినోమా భారతదేశంలో అత్యంత సాధారణ కనురెప్పల క్యాన్సర్. అన్ని కనురెప్పల క్యాన్సర్లలో దీని వాటా 53% - పాశ్చాత్య దేశాలతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ శాతం. పశ్చిమ దేశాలలో సాధారణ కంటి క్యాన్సర్ అయిన యూవియల్ మెలనోమా భారతదేశంలో చాలా అరుదు.

## కంటి కాన్సరుకు ప్రమాద కారకాలు ఏవి?

కణితి రకంపై ఆధారపడి, జన్యుపర మరియు కుటుంబ కారకాలు, జాతి, యూవీకి గురికావడం, రోగనిరోధక శక్తి తగ్గిన పరిస్థితులు మరియు ధూమపానం వంటి వ్యక్తిగత అలవాట్లతో సహా వివిధ ప్రమాద కారకాలవలన కంటి కాన్సర్లు అభివృద్ధి చెందుతాయి. కొన్ని క్యాన్సర్లు లేత రంగు కళ్ళు, వయస్సు మరియు ఇప్పటికే ఉన్న కంటి పరిస్థితులతో కూడా ముడిపడి ఉంటాయి.

## కంటి కాన్సర్ సూచనలు మరియు లక్షణాలు ఏవి?

లక్షణాలు స్పష్టంగా కనిపించకపోవచ్చు. ఇది కంటి కాన్సరును త్వరగా గుర్తించడంలో ఉన్న పెద్ద సవాళ్ళలో ఒకటి. తరచుగా ఇది క్రమబద్ధమైన కంటి పరీక్షలలో బయటపడుతుంది. అందుకే, త్వరిత నిర్ధారణకు క్రమబద్ధమైన కంటి పరీక్షలు చాలా ముఖ్యం.

కంటి కాన్సర్ సాధారణ హెచ్చరిక సంకేతాలలో ఈ క్రిందివికూడా ఉన్నాయి:

- బిడ్డ కంటిలో ఒక తెల్లని ప్రతిబింబం (రెటినోబ్లాస్టోమా ముఖ్య సంకేతం)
- చెదిరిన చూపు లేదా ఉన్నట్లుండి చూపు పోవడం
- ఐరిస్ (కంటిలోని రంగు భాగం) పై ఒక నల్లని లేదా పెరుగుతున్న మచ్చ
- ఒక కన్ను ఉబ్బడం లేదా కంటి ఆకారంలో ఉన్నట్లుండి మార్పు
- కనురెప్పపై లేదా కంటి చుట్టూ ఒక గడ్డ

- కాంతి మెరుపులు, వంపుతిరిగిన గీతలు లేదా తేలియాడే మచ్చలను చూడటం
- కంటి ఎరుపుదనం, దీర్ఘకాలంగా చికాకు లేదా ఇన్ఫ్లమేషన్
- కంటిలో లేదా కంటి చుట్టూ నొప్పి (తొలి దశలలో అరుదు)

**చికిత్స ఎంపికలు: చూపు, కన్ను మరియు ప్రాణాన్ని కాపాడటం**

నిర్ధారణ జరిగిన తరువాత, చికిత్స నిర్ణయాలు కణితి రకం, స్థానం, పరిమాణం, పెరుగుదల తీరులు, మరియు జటిలతలపై ఆధారపడతాయి. కంటి కాన్సర్ చికిత్సలలో ఈ క్రిందివి ఉన్నాయి:

✅ పరిశీలన - నెమ్మదిగా పెరుగుతున్న లేదా తక్షణ జోక్యం అవసరం లేని చిన్న కణితులకు.

✅ శస్త్రచికిత్స (స్థానిక విచ్ఛేదం) – కంటి పనితీరును సాధ్యమైనంతవరకూ కాపాడుతూ కణితులను తొలగించడం.

✅ కెమోథెరపీ – కాన్సర్ రకం మరియు స్థానాన్ని బట్టి టాపికల్, ఇంట్రావీనస్, ఇంట్రా-ఆర్టీరియల్, లేదా ఇంట్రావిట్రియస్ ఇవ్వబడుతుంది.

✅ రేడియేషన్ చికిత్స – కాన్సర్ కణాలను నాశనం చేయడానికి కంటి సంబంధిత ప్లాక్ బ్రాచీథెరపీ లేదా బాహ్య బీమ్ రేడియేషన్ ఉపయోగిస్తారు.

✅ ఎన్యూక్లియేషన్ లేదా ఎక్సెన్టరేషన్ – ప్రభావితమైన కంటిని తీసివేయడం. చూపును రక్షించగల చికిత్సలు ఆచరణీయం కానప్పుడు మాత్రమే పరిగణించబడుతుంది.

కాన్సర్ చికిత్సలో పురోగతులు మనుగడ రేట్లను, కన్ను మరియు చూపు సంరక్షణను గణనీయంగా మెరుగుపరచింది. కానీ, త్వరిత నిర్ధారణ మరియు జోక్యం చాలా కీలకం.

**మరింత అవగాహన మరియు ప్రత్యేక సంరక్షణ ఆవశ్యకత**

కంటి కాన్సర్ కేసులు చాలామటుకు తీవ్ర దశలో కంటి కాన్సర్ క్లినిక్ కి తీసుకుని రావడమనేది భారతదేశంలో అతిపెద్ద సమస్యలలో ఒకటి. ఇది తరచుగా అవగాహన లేకపోవడం లేదా శిక్షితులైన కంటి కాన్సర్ నిపుణుల అందుబాటు పరిమితంగా ఉండటంవలన జరుగుతున్నది.

**మీరు ఏమి చేయగలరు?**

☐ అసాధారణ లక్షణాలను నిర్లక్ష్యం చెయ్యకండి – చూపులో ఉన్నట్లుండి ఏదైనా మార్పు, కంటి వాపు, లేదా కన్ను అసాధారణంగా కనిపిస్తే, వెంటనే పరీక్ష చేయించుకోవాలి.

☐ సాధారణ కంటి పరీక్షలు – మీకు ఏ లక్షణాలూ లేకపోయినా, క్రమబద్ధమైన కంటి పరీక్ష కంటి కాన్సర్ తీవ్రం కాకముందే త్వరితంగా గుర్తించగలుగుతుంది.

☐ ☐ ప్రత్యేక సంరక్షణ పొందండి – కంటి సమస్య కొనసాగితే, నిర్ధారించడానికి నిపుణుడిని సంప్రదించండి.

**త్వరగా గుర్తించడం జీవితాలను, కంటిని మరియు చూపును రక్షిస్తుంది!**

కంటి కాన్సర్ అరుదు కావచ్చు. కానీ నిర్లక్ష్యం చేస్తే, అది ప్రమాదకరం. చూపును, కంటిని మరియు జీవితాలను రక్షించడంలో అవగాహన పెంచడం మరియు త్వరగా గుర్తించడాన్ని మెరుగుపరచడం భారీ వ్యత్యాసాన్ని తెస్తుంది. మే నెలలో, రెటినోబ్లాస్టోమా వారం సందర్భంగా, ఈ వ్యాధితో బాధపడుతున్న పిల్లలలో త్వరిత గుర్తింపు మరియు చికిత్సపట్ల అవగాహన పెంచడానికి మరియు నిధులు సేకరించడానికి ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఒక వార్షిక పరుగు 'పైటథాన్' నిర్వహిస్తున్నది. త్వరగా గుర్తిస్తే, రెటినోబ్లాస్టోమా ఒక నయం చేయగల కంటి కాన్సర్.

కంటిలో ఏవైనా అసాధారణ మార్పులు మీరు గమనిస్తే, ఆలస్యం చెయ్యకండి – ఈరోజే కంటిపరీక్ష చేయించుకోండి!